

వైసీపీ ఓటమితో... మూగబోయిన జడ్పీటీసీలు

- ఉత్సవ విగ్రహాల్లా కమిటీల చైర్మన్‌లు
- సమస్యలను పట్టించుకోని వైనం
- చుట్టం చూపునకే పరిమితం
- పేలవంగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

సాధారణ ఎన్నికల ఫలితాలలో అటు రాష్ట్రంలోను, ఇటు మాజీ సీఎం జగన్ జిల్లాలోను వైసీపీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. జూన్ 4న ఫలితాలు వెలువడిన నాటి నుంచి వైసీపీ క్యాడర్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు నిద్రపట్టని రోజులను గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జడ్పీ సమావేశహాలులో నిర్వహించిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో వైసీపీ జడ్పీటీసీ సభ్యుల గొంతు పూర్తిగా మూగబోయింది. 50 మంది జడ్పీటీసీలు ఉండగా కేవలం 20 మందిలోపే హాజరయ్యారు. వీరిలో కూడా కేవలం పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల చెన్నయ్య మాత్రమే పసలేని మూడు నాలుగు సమస్యలపై పెదవి విప్పారు. మిగిలిన వారంతా చుట్టం చూపునకే పరిమితమయ్యారు. ఏడు సంఘాల పరిధిలోని వివిధ శాఖలపై కేవలం 40 నిమిషాలు మాత్రమే ఆయా అధికారులతో మొక్కుబడిగా సమీక్ష నిర్వహించారు.



మాట్లాడుతున్న జడ్పీ వైస్‌చైర్మన్ బాలయ్య

కడప(రూరల్) జూన్ 7: జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం ఉదయం 10-30 నిమిషాలకు ప్రారంభించారు. ఆయా కమిటీల చైర్మన్‌లు సమావేశ వేదికపై అధికారులు వినిపిస్తున్న ప్రగతి నివేదికలను వింటూ ఉత్సవ విగ్రహాల్లాగా ఉండిపోయారు. ఇదివరకు జడ్పీ చైర్మన్ హోదాలో ఆకేపాటి అమరనాథరెడ్డి అధ్యక్షతన ప్రణాళిక మరియు ఆర్థికస్థాయి, గ్రామీణాభివృద్ధి, నిర్మాణపు పనులు, విద్య మరియు వైద్యసేవల స్థాయి సంఘం సమావేశాలు నిర్వహించేవారు. ఆయన ఇటీవల ఎమ్మెల్యేగా గెలుపొందిన కారణంగా శుక్రవారం నాటి స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరుకాకపోవడంతో చైర్మన్ నేతృత్వంలోని పై నాలుగు కమిటీలను కలుపుకుని వ్యవసాయశాఖ కమిటీ చైర్మన్ బాలయ్య (వైస్ చైర్మన్-2), మహిళా సంక్షేమం స్థాయి సంఘం అధ్యక్షురాలు జె.శారద (వైస్ చైర్‌పర్సన్-1), సాంఘిక సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ సి.పుష్పలతలు కలిసి సమష్టిగా నిర్వహించినప్పటికీ. ఏ ఒక్కరు సమావేశాలను సజావుగా జరిపించలేదు.

పేలవంగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని పేలవంగా నిర్వహించారు. ఉదయం 10-40 గంటలకు ప్రారంభించి 11-20 నిమిషాలకు మమ.. అనిపించారు. సమావేశాల్లో ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై అర్థవంతమైన చర్చలేకుండా సాగించి ప్రజాప్రతినిధులు, అధికారులు ఇలా వచ్చి అలా వెళ్లారు. సమావేశ ప్రారంభం నుంచి ఒక్కొక్కశాఖకు 7 నిమిషాల వ్యవధికూడా కేటాయించకుండా పరుగో.. పరుగు అన్నట్లుగా సాగించారు. మొత్తంగా ఉన్న 7 స్టాండింగ్ కమిటీ సమావేశాలను ఒకేచోట ఒకదాని తరువాత ఒకటి టకటకా నిర్వహించి ఓ పనైపోయిందని చేతులు దులిపేసుకున్నారు.

ప్రశ్నలేదు.. సమాధానం లేదు..!

ఇప్పటి వరకు నిర్వహించిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలలో ఏనాడూ ఆయా శాఖల పనితీరుపై పూర్తిగా అర్థవంతమైన చర్చ కొనసాగించలేదు. ఆ పరంపరను శుక్రవారం కూడా కొనసాగించారు. ఆయా కమిటీల చైర్మన్ల నుంచి కానీ సభ్యుల నుంచి కానీ ప్రశ్నలు లేకపోవడంతో అధికారులు కూడా సమాధానాలు చెప్పాల్సిన అవసరం లేకుండా సరిపుచ్చారు. సమావేశాల పేరుతో ఖర్చులు మాత్రం తడిపి మోపెడవుతున్నాయి.

బాధ్యతను మరిచిన ప్రజాప్రతినిధులు

శుక్రవారం నిర్వహించిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ప్రజా సమస్యలను పట్టించుకోలేదు. ప్రస్తుతం 2024 ఖరీఫ్ ప్రారంభమైంది. నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే ప్రవేశించి వర్షాలు ఆశాజనకంగా పడుతున్నాయి. అయినప్పటికి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను నిన్నటి వరకు (జూన్ 4 వరకు) అధికారం ఉన్న వైసీపీ ప్రభుత్వం అందించలేదు. దీంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పారిశుధ్యపు పనులు సక్రమంగా కొనసాగడంలేదు. గ్రామీణ మంచినీటి సరఫరా పథకం నత్తనడకన సాగుతోంది. మట్టిమాఫియా, ఇసుక మాఫియా రాజ్యమేలుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. మరో వారం రోజుల్లో విద్యాలయాలు ప్రారంభం కాబోతున్నాయి. విద్యార్థులకు అవసమైన పాఠ్యపుకాలు, మౌలిక వసతుల కొరత పరిపాటిగా వస్తోంది. వీటన్నింటిపై పూర్తి స్థాయిలో చర్చించి పరిష్కారం చూపాల్సిన గురుతర బాధ్యతను ప్రజాప్రతినిధులు మరిచిపోయి సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించారు.

అధికారులే బహుబాగు

శుక్రవారం నిర్వహించిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి కడప, అన్నమయ్య జిల్లాల ఆయాశాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఆయా కమిటీల పరిధిలోని శాఖల అధికారులు వారి పరిధిలోని సమాచారాన్ని, సంక్షేమాన్ని, పథకాలను, అభివృద్ధిని వెల్లడించారు. ఏవైనా సందేహాలు ఉంటే సమాధానాలు వినిపిస్తామని చెప్పారు. కానీ ప్రజాప్రతినిధులు ఎవ్వరూ నోరు మెదపలేదు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో రమణారెడ్డి, కడప, అన్నమయ్య జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

చైర్మన్ చాంబర్‌లో వైసీపీ ఓటమిపై చర్చ

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని వైసీపీ జడ్పీటీసీ సభ్యులంతా త్వరత్వరగా ముగించుకుని చైర్మన్ చాంబర్‌కు చేరుకున్నారు. అక్కడ మహిళా జడ్పీటీసీల బంధువులు, కొందరు వైసీపీ నాయకులతో కలిసి ఇటీవల వెలువడిన సార్వత్రిక ఫలితాలలో వైసీపీ ఓటమిపై చర్చించుకున్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను గానీ, కింది స్థాయి నాయకులను, కార్యకర్తలను పట్టించుకోకపోవడం వలనే ఓటమికి కారణాలుగా చెప్పుకొచ్చారు. సమస్యలను ఎంత చెప్పినా వినిపించుకోలేదని.. బటన్లు నొక్కితే సరిపోదని ఇప్పుడు చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏమి ప్రయోజనమని మాట్లాడుకున్నారు. వైసీపీ ప్రభుత్వ పెద్దల స్వయం కృతాపరాధమే ఓటమికి కారణమని నిట్టూర్చారు. కాగా.. ఒత్తిడి తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేయించారని వాటికి నిధులు ఇవ్వకుండానే వైసీపీ ప్రభుత్వం దిగిపోయి తమను సర్వనాశనం చేసిందని పనులు చేపట్టిన కొందరు ఆవేదన, ఆక్రోశం వ్యక్తం చేశారు. తాము రూ.3 కోట్లకు పనులు చేశామని ఇప్పుడు బిల్లులు రాకుంటే ఏ బాయిలో దూకాలో తెలీడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు.

జడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేశా

కడప (రూరల్), జూన్ 7: ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట శాసన సభ్యునిగా తాను ఎన్నిక కావడంతో జడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేశానని ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కడప కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయరామరాజును కలిసి రాజీనామా పత్రాన్ని అందజేశారు. అతనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఒక పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. తమ మూడేళ్ల జడ్పీ చైర్మన్ పాలనలో జిల్లా అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషిచేశానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు, అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతులను కల్పించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకున్నామన్నారు. సాధారణ ఎన్నికల్లో ప్రజా తీర్పును శిరసా వహిస్తున్నామన్నారు. గెలుపొందిన కొత్త శాసన సభ్యులందరికి శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ వివక్ష లేకుండా జిల్లా అభివృద్ధికి పాటుపడాలన్నారు.

వెంటలేని జడ్పీ పాలకమండలి సభ్యులు

జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్న సమయంలో ఆయన వెంట పాలక మండలి సభ్యులు ఎవరూ కనిపించలేదు. ఆయన 2021 సెప్టెంబర్‌లో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో ఒంటిమిట్ట మండల జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తరువాత అదే ఏడాది సెప్టెంబర్ 25న జడ్పీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. రెండు సంవత్సరాల తొమ్మిది నెలల పాటు చైర్మన్‌గా కొనసాగి పలు స్టాండింగ్ కమిటీ సమావేశాలను, జడ్పీ సర్వసభ్య సమావేశాలను నిర్వహించారు. అయితే సమావేశాల అనంతరం ఆయన జడ్పీటీసీలకు అందుబాటులో ఉండేవారు కాదని అంటారు. దీనికి తోడు ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కొలువుదీరనుంది. ఈ నేపథ్యంలో జడ్పీ చైర్మన్ పదవికి ఆకేపాటి రాజీనామా చేస్తున్నారనే విషయం తెలిసినా పాలకమండలి సభ్యులు ఆయన వెంట ఎవ్వరూ వెళ్లలేదు.



రాజీనామా అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఆకేపాటి

ముగ్గురు మొనగాళ్లు

- అనకాపల్లె, ఏలూరు ఎంపీలుగా..
- ధర్మవరం ఎమ్మెల్యేగా జిల్లావాసుల విజయం

కడప, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా అంటే ఉమ్మడి రాష్ట్రంలో ఎనలేనిపేరు ఉంది. ఇక్కడి నుంచే ఇద్దరు ముఖ్యమంత్రులు అయ్యారు. రాజకీయంగా జిల్లాకు ఎంతో ప్రత్యేకత ఉంది. పక్క రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో సైతం కడప మార్క్ ఉంటుంది. ఈసారి కూడా జిల్లా పేరు ప్రఖ్యాతులు రాష్ట్రం నలుమూలల విస్తరించాయి. ఎందుకంటే మనోళ్లు బయటి పొరుగు జిల్లాలకు వెళ్లి పోటీ చేసి గెలుపొంది మరీ కడప ఖ్యాతిని చాటారు. ఇంట గెలిస్తే కిక్కేముంటుంది... రచ్చ గెలిస్తే కిక్కుంటుంది అన్నట్టుగా.. ఇద్దరు ఎంపీలుగా, ఒకరు ఎమ్మెల్యేగా గెలవడంతో మరోసారి కడప జిల్లా పేరు పొరుగు జిల్లాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ముగ్గురు మొదటిసారిగా ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేసి గెలవడం గమనార్హం.

సీఎం రమేశ్



ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తికి చెందిన మాజీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ కూటమి అభ్యర్థిగా అనకాపల్లె పార్లమెంట్ స్థానానికి పోటీ చేశారు. ఈయన ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేయడం ఇదే మొదటిసారి. గతంలో టీడీపీలో కీలకంగా ఉన్నారు. 2019 ఎన్నికల తర్వాత బీజేపీలో చేరారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా అనకాపల్లె ఎంపీగా బరిలో దిగారు. పోలింగ్ రోజున స్వగ్రామమైన పోట్లదుర్తికి వచ్చి ఓటు వేసి తిరిగి అనకాపల్లెకు వెళ్లారు. ఎన్నికల్లో సీఎం రమేశ్ వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుపై 2,96,530 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. అనకాపల్లె పార్లమెంటులో 13,25,323 ఓట్లు పోల్ కాగా సీఎం రమేశ్‌కు 7,62,069 ఓట్లు వచ్చాయి. ముత్యాల నాయుడుకు 4,65,530 ఓట్లు వచ్చాయి.

పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్



ఏలూరు ఎంపీగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తనయుడు మహేశ్‌కుమార్ యాదవ్ పోటీచేశారు. ఈయన పోటీచేసిన తొలిసారే వైసీపీ అభ్యర్థిపై 1,78,326 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇక్కడ మొత్తం 13,82,049 ఓట్లు పోలయ్యాయి. ఇందులో టీడీపీ అభ్యర్థి పుట్టా మహేశ్‌కుమార్‌యాదవ్‌కు 7,46,351 ఓట్లు వచ్చాయి. వైసీపీ అభ్యర్థి కె.సునీల్‌కుమార్‌కు 5,64,494 ఓట్లు వచ్చాయి. అయితే మైదుకూరు ఎమ్మెల్యేగా తండ్రి పుట్టా సుధాకర్‌యాదవ్, ఏలూరు ఎంపీగా తనయుడు తొలిసారి గెలవడం గమనార్హం.

సత్యకుమార్



ఉమ్మడి అనంతపురం జిల్లా ధర్మవరం అసెంబ్లీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా ప్రొద్దుటూరుకు చెందిన సత్యకుమార్ పోటీ చేశారు. వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై 3,734 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇక్కడ పోరు హోరాహోరీగా సాగింది. రోజూ మార్నింగ్ వాక్ ద్వారా ధర్మవరంలో సమస్యలు గుర్తించి పరిష్కరిస్తారంటూ కేతిరెడ్డికి పేరుంది. ఆ మేరకు ఈయన రోజూ వీడియోలు సైతం సోషల్‌మీడియాలో పెడు తుంటారు. ఇక్కడ మొత్తం 2,18,282 ఓట్లు పోల్ కాగా.. సత్యకుమార్‌కు ఈవీఎంల ద్వారా 1,02,957 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ 1580 ఓట్లు వచ్చాయి. ఇక కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ఈవీఎంల ద్వారా 1,01,983, పోస్టల్ బ్యాలెట్ 883 ఓట్లు వచ్చాయి. మొత్తం 3,734 ఓట్ల మెజార్టీతో సత్యకుమార్ సత్తా చాటారు. ఈ ముగ్గురు తొలిసారిగా ఇతర జిల్లాల్లో పోటీ చేసి గెలవడం విశేషం. ఇంట గెలిచి రచ్చగెలవాలి అనే సామెతను వీరు తిరగరాశారు.. ఇంటకాదు.. రచ్చలో గెలిస్తేనే మజా అన్నట్టుగా గెలిచి చూపించారు.

జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటయ్యేనా?

- తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 7: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు జిల్లాలో నిరుద్యోగ యువత పరిస్థితి ఉందని, జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఈ పర్యాయం అయినా ఏర్పాటయ్యేనా అని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలన్న ఉద్దేశంతో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2014లో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్‌ను మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిఉంటే ఈపాటికి పూర్తి అయి ఉండేదన్నారు. ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు కావాల్సిన అన్ని హంగులు జిల్లాలో ఉన్నాయన్నారు. కావాల్సినంత భూమిఉంది, నీటిసరఫరాకు సంబంధించి గండికోట, మైలవరం, బ్రహ్మంసాగర్, సోమశిల రిజర్వాయర్లు ఉన్నాయన్నారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి రాయలసీమ థర్మల్‌పవర్ ప్లాంట్ ఉందన్నారు. రవాణాకు సంబంధించి రోడ్లు, రైలు, విమాన, జలమార్గాలు ఉన్నాయన్నారు. ముడి సరుకుకు సంబంధించి కావాల్సిన సున్నపురాయి, డోలమైట్ ఉన్నాయన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేని కారణంగా పదేళ్లలో అమలుకు నోచుకోలేదన్నారు. ప్రస్తుత పరిస్థితులు మారాయని, కేంద్రంలో బీజేపీ టీడీపీపై ఆధారపడి మనుగడ సాగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుచేయాల్సిన బాధ్యత కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉందన్నారు.

నగరంలోని వైజంక్షన్ నుంచి పాత బైపాస్ రోడ్డు మొత్తం నీటితో నిండిన దృశ్యం



కడప జలమయం

జిల్లా కేంద్రమైన కడప నగరంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ప్రధాన ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. నగరంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కుండపోత వర్షం కురిసింది. దీంతో నగరంలోని జిల్లా కోర్టు, ఆర్టీసీ బస్టాండు, చిన్నచౌకు, రైల్వేస్టేషన్‌రోడ్డు, శంకరాపురం, పాతబస్టాండు, హోమియోపతి కాలేజీ రోడ్డు ఇలా చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. శంకరాపురంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో అయితే ఇళ్లల్లోకే నీరు చేరింది. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ సమస్యను ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని, ప్రస్తుతం వచ్చిన టీడీపీ ప్రభుత్వమైనా తమ సమస్యను పరిష్కరించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

\- కడప (ఎర్రముక్కపల్లె)



ఆర్టీసీ బస్టాండు వద్ద నిలిచిన నీరు





నగరంలోని జిల్లా కోర్టు ఎదురుగా మోకాలి లోతు నీటిలో వెళుతున్న వాహనాలు

ప్రతి వాగ్దానం నెరవేరుస్తాం

- 20 ఏళ్ల తరువాత కడపలో టీడీపీ జెండా రెపరెపలు
- కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, చిత్రంలో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి తదితరులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 7: కడపలో 20 ఏళ్ల తర్వాత టీడీపీ జెండా రెపరెపలాడిందని, తాము ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తామని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. టీడీపీ మీద, చంద్రబాబుపై జిల్లా ప్రజల అభిమానం మరువలేనిదన్నారు. శుక్రవారం కడప నగరం ద్వారకానగర్‌లోని వారి నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. 2019లో అన్ని సీట్లు ఓడిపోయినా ఈ ఎన్నికల్లో ఐదుస్థానాల్లో గెలవడం సంతృప్తి ఇచ్చిందన్నారు. జగన్ ఏదో చేస్తాడని ప్రజలు గెలిపిస్తే ఐదేళ్ల పాలనలో చేసింది శూన్యమన్నారు. జగన్ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేకపోయారన్నారు. సీటిపారుదల ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం చూపారన్నారు. ప్రస్తుతం ప్రతిపక్షం లేకుండా పోయిందన్నారు. వైసీపీ ప్రభుత్వం భూకబ్జాలు, ఇసుక మాఫియా దోచుకోవడం తప్ప ఏమీ చేయలేదన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లపాలనలో సొంత జిల్లాకు ఏమీ చేయలేకపోయారన్నారు. నీవు వద్దు జగన్ అంటూ ప్రజలు బైబై చెప్పారన్నారు. అధికారుల ద్వారా ఆస్తులు దోచుకోవడం తప్ప పదేళ్లలో కడప ఎమ్మెల్యే అంజద్‌బాషా ఏమీ చేయలేదన్నారు. ఓటర్లు కూడా మాట్లాడేందుకు భయపడ్డారన్నారు. ఒక మహిళ తొలిసారిగా పోటీ చేస్తుంటే ఇష్టమొచ్చినట్లు మాట్లాడిన విషయం గుర్తు చేశారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడమని.. అయితే గంజాయి, బంగారు స్మగ్లర్లు రౌడీలు త్వరగా కడపను వదిలి వెళ్లిపోవాలని హితవు పలికారు. చట్టం ద్వారా చర్యలు తీసుకోవాలని పోలీసులకు స్వేచ్ఛనిస్తామన్నారు. రూ.2,300 కోట్లు తెచ్చి కడపను అభివృద్ధి చేశామని సిగ్గులేకుండా మాట్లాడుతున్నారన్నారు. సిగ్గు సంస్కారం డబ్బు ఉంటే ఆధారాలు చూపించాలన్నారు. లేకపోతే రాజకీయం నుంచి తప్పుకుంటావా అని సవాల్ చేశారు. కడప నియోజకవర్గ సమస్యలలో ప్రధానమైనది రవీంద్రనగర్‌లో బ్రిడ్జి లేకపోవడం అని.. దీనిని తాము కడతామన్నారు. నీరు పుష్కలంగా ఉన్నా నగరంలో మంచినీటి సమస్య ఉందని, చేసిన వాగ్దానాలకు కట్టుబడి ప్రతి సమస్య త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

జమ్మలమడుగు, జూన్ 7: జమ్మలమడుగు మండలంలోని గొరిగెనూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఇంజేటి ఉదయ్ (30) అనే వ్యక్తి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు మృతుడు ఇంజేటి ఉదయ్ మండలంలోని గొరిగెనూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందినవాడు. ఈయనకు పది సంవత్సరాల క్రితం ఆళ్లగడ్డ పెద్దకందుకూరు గ్రామంలో వివాహం చేశారన్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు, కాగా మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అప్పటి నుంచి ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడేవాడరన్నారు. కాగా శుక్రవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన పరిశీలించేందుకు అర్బన్ సీఐ కరుణాకర్, పోలీసు సిబ్బంది గ్రామంలో సందర్శించి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఇంజేటి ఉదయ్ మృతదేహం

18 తులాల బంగారు, నగదు చోరీ

ఎర్రగుంట్ల, జూన్ 7: ఎర్రగుంట్ల సీఎస్ఆర్ కాలనీలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. కాలనీలో నివాసం ఉంటున్న లింగాల బాలగంగిరెడ్డి ఎన్నికల సందర్భంగా తమ గ్రామం తురకపల్లెకు వెళ్లినట్లు తెలిపారు. ప్రతి రోజూ తాను వచ్చి ఇంట్లో లైట్ వేసి వెళుతున్నానని, గురువారం మాత్రం రాలేదన్నారు. గురువారం తెల్లవారుజామున 5గంటలకు పనిమనిషి శ్రీవల్లి వచ్చి చూడగా తలుపుల బీగం పగలగొట్టి తెరచి వుండటంతో తనకు సమాచారం ఇచ్చిందన్నారు. తాను వచ్చి చూడగా బీరువాలో ఉన్న బంగారు, డబ్బును, ఇంటి, స్థలాల ఒరిజినల్ పత్రాలు చోరీచేసి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. 3తులాల లాంగ్‌చైన్,4తులాల 4గాజులు,2తులాల రాళ్లహారం, 2తులాల రెండు చైన్లు,3తులాల ఒక చైన్,మూడు జతల జుంకీల కమ్మలు,4ఉంగరాలతోపాటు రూ.1.5లక్షల నగదును, ఇంటి, స్థలాల ఒరిజినల్ పత్రాలు చోరీ చేసినట్లు గంగిరెడ్డి తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించింది. ఈవిషయంపై పోలీసులు విచారిస్తున్నారు. ఇటీవలే తన కుటుంబం హైదరాబాదు నుంచి వచ్చిందని అందువల్లే బంగారం ఇక్కడ ఉంచినట్లు తెలిపారు.



బీరువా పగలకొట్టి చోరీ చేసిన దృశ్యం

దుప్పిపై కుక్కల దాడి

సీకేదిన్నె, జూన్ 7: కుక్కల దాడిలో దుప్పి గాయపడటంతో గ్రామస్థులు రక్షించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. చింతకొమ్మదిన్నె మండలం మద్దిమడుగు వద్ద శుక్రవారం అడవిలో నుంచి వచ్చిన దుప్పి కుక్కలబారిన పడింది. వాటి నుంచి రక్షించుకునేందుకు ఎంత ప్రయత్నించినా కుక్కలు వదలకపోవడంతో గ్రామంలోకి వచ్చింది. దీంతో ఆ గ్రామానికి చెందిన జబ్బార్ బాషా కుక్కలను తరిమికొట్టి దుప్పిని రక్షించారు. గాయపడిన దుప్పిని ఇంటివద్దనే చెట్టుకు కట్టివేసి కుక్కలు రాకుండా రక్షణ కల్పించారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించి వారి స్వాధీనం చేశారు. దీంతో గ్రామస్థులు దర్బార్‌బాషాను అభినందించారు.



కుక్కలనుంచి దుప్పిని కాపాడిన దర్బార్‌బాషా

రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు

రూ.1.75లక్షలు జరిమానా

మైదుకూరు, జూన్ 7 : పట్టణంలోని 2 ప్రధాన రైస్‌మిల్లులపై విజిలెన్స్ తూనికల శాఖ అధికారులు దాడులు చేసి, రూ 1.75లక్షలు జరిమానా విధించారు. పట్టణంలోని శ్రీలక్ష్మి గణేష, శ్రీలక్ష్మి సుబ్బరాయ మాడరన్ రైస్ మిల్లులపై శుక్రవారం కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాలు, తూనిక కొలతల శాఖ అధికారులు మూకుమ్మడిగా దాడి చేశారు. అక్కడ ఉన్న బియ్యం బస్తాల నిల్వలు వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. బియ్యపు బస్తాలపై ప్యాకింగ్ తేదీలు, వాటి వివరాలు లేవని నిర్ధారించి, తూనిక, కొలతల శాఖాధికారులు రూ.75 వేలు, మిల్లుకు సంబంధించి వివరాలతో కూడిన సూచిక బోర్డులు లేవని లక్ష రూపాయలు జరిమానా విధించినట్లు అధికారులు షేక్ మాసుంబాష తెలిపారు. ఈ తనిఖీలో సీఐలు టి రెడ్డప్ప, ఈదురుబాష, అర్జున్‌రావు, సివిల్ సరఫరా అధికారి తారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

రేషన్ దుకాణంలో...

ప్రొద్దుటూరు, జూన్ 7 : ప్రొద్దుటూరు పట్టణం రామనగర్‌లో 7వ నెంబరు రేషన్ దుకాణం నుంచి అక్రమంగా బియ్యం తరలించటంపై వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం జిల్లా పౌర సరఫరాల అధికారి చాముండేశ్వరి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో డీలర్ వద్ద వున్న స్టాకు, ఎండీయూ ఆపరేటర్ వద్దవున్న స్టాకును పరిశీలించారు. బియ్యంనిల్వల్లో ఎంత వ్యత్యాసం తేడాలున్నాయెూ పూర్తి స్థాయిలో పరిశీలించి విచారణ నివేదికను పంపాలని ఆర్ఐ సాయిప్రసాద్‌ను ఆదేశించారు. షాపులో దాదాపు 172 బియ్యం బస్తాలు వున్నట్లు ప్రాథమిక సమాచారం. అయితే వీటిని తూకం వేసి నిల్వల్లో తేడాలను గుర్తించి జిల్లా అధికారికి నివేదిస్తామని ఆర్ఐ సాయిప్రసాద్ తెలిపారు.



రాంనగర్‌లోని 7వ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న పౌరసరఫరాల అధికారులు

బడిబస్సులు భద్రమేనా ?



బద్వేలు ఆర్టీవో కార్యాలయంలో ఎఫ్‌సీల కోసం క్యూలో ఉన్న విద్యాసంస్థల బస్సులు

- త్వరలో ప్రారంభం కానున్న విద్యాసంవత్సరం
- పిల్లల భద్రత అత్యంత కీలకం
- స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరి

బద్వేలుటౌన్, జూన్ 7: విద్యాసంస్థలకు సంబంధించిన బస్సుల ఫిట్‌నెస్‌లపై రవాణాశాఖ అధికారులు దృష్టిసారించారు. పిల్లలకు ఉత్తమ విద్యను అందించాలని తల్లిదండ్రులు ఇప్పటికే భారీగా ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చేర్పిస్తున్నారు. కేవలం పిల్లల చదవులపై మాత్రమే కాకుండా వారు నిత్యం ఇంటినుంచి పాఠశాలలకు, కళాశాలలకు రాకపోకలు సాగించే బస్సుల సామర్థ్యంపై కూడా దృష్టి సారించాలి. బడిబస్సులు భద్రంగా ఉంటే పాఠశాల పిల్లల ప్రయాణం సురక్షితంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యాసంస్థల యజమానులు బస్సుల నిర్వాహణపై జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాలల పునఃప్రారంభానికి ముందే బస్సు సామర్థ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సూచిస్తున్నారు. విద్యార్థుల కోసం సిద్ధంగా ఉన్న వాహనాలు కండీషన్లలో ఉన్నాయా లేదా అనేదానిపై క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలోని కాశినాయన, కలసపాడు, బి.కోడూరు, బద్వేలు, గోపవరం, అట్లూరు, పోరుమామిళ్ల, మైదుకూరు మండలాల్లో 240 పాఠశాలల బస్సులున్నాయి. ఆ వాహనాలకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టికెట్లు అవసరమని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సూచిస్తున్నారు. ఆ వాహనాలకు సంబంధించిన అన్నిరకాల పత్రాలు ఉన్నాయా లేదా అని పరిశీలిస్తూ అనుమతులు లేనివాటికి జరిమానాలు, కేసులు నమోదు చేస్తున్నారు.

నిబంధనలు తప్పనిసరి

విద్యాసంస్థలు తమ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలంటే రవాణాశాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. లేదంటే ఫిట్‌నెస్ పరీక్షకు అనర్హతవేటు వేస్తారు. విద్యాసంస్థల వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలంటే సదరు వాహనం డ్రైవర్‌కు వయస్సు 60 ఏళ్ల లోపు ఉండాలి. డ్రైవర్ ఆరోగ్యంగా, కంటిచూపు సక్రమంగా ఉండాలి. డ్రైవర్ ఆరోగ్యానికి సంబంధించిన బాధ్యతలను విద్యాసంస్థలు చూసుకోవాలి. పాఠశాల యాజమాన్యం డ్రైవర్లను తీసుకునే ముందు రవాణా శాఖ అధికారులకు కచ్చితంగా తెలియజేయాలి. డ్రైవర్‌కు హెవీడ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. బస్సులో అత్యవసర ద్వారం ఉండి, ఫస్ట్‌ఎయిడ్‌బాక్స్ అగ్నిమాపక పరికరాలను కచ్చితంగా కలిగి ఉండాలి. అలాంటి వసతులు కలిగిన వాహనాలకు మాత్రమే పరీక్షలు నిర్వహించిన అనంతరం అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

విద్యాసంస్థల బస్సుల నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ప్రస్తుతం స్కూలు బస్సులకు ఎఫ్‌సీల రెన్యువల్ కొనసాగుతోంది. నిర్దేశిత సమయంలోగా తప్పనిసరిగా ఎఫ్‌సీ రెన్యువల్ చేసుకోవాల్సిందే ఎఫ్‌సీలు, ఇతర పత్రాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా స్కూలు బస్సులు రోడ్డుపై నడిపితే చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ పట్టుబడితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.

- శేఖర్‌రావు,
మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, బద్వేలు



ప్రైవేటు బస్సులను పరిశీలిస్తున్న అధికారులు

కుందూకు భారీగా వరద

రాజుపాలెం, జూన్ 7 : కర్నూలు జిల్లాలో పడుతున్న వర్షాలకు కుందూకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం రాజోలి ఆనకట్ట వద్ద 6080 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని అధికారులు తెలిపారు. వర్షాలు భారీగా పడుతుండడంతో ఈ ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. కుందూకు ఇరువైపులా పంటలు సాగు చేసిన రైతన్నలకు ఈ వర్షం నీరు ఆశలు పుట్టిస్తోంది. ఖరీఫ్ మొదలు కావడంతో కుందూకు ఇరువైపులా వరినార్లు పోసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రాబోవు రోజుల్లో మరింత వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఇక పంటలకు ఇబ్బంది లేకుండా కుందూ ప్రవహిస్తుందని రైతుల్లో ఈ వర్షం నీరు ఆశ రేకెత్తుతోంది.



సింహాద్రిపురంలో వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

సింహాద్రిపురం, జూన్ 7: సింహాద్రిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో అబ్బాస్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన వంశీధర్‌రెడ్డి దాడి చేశాడని ఈమేరకు శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ అనీల్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు.. బాధితుడు అబ్బాస్ సింహాద్రిపురం బస్టాండు సమీపంలో బజారులో ఉండగా అదేసమయంలో అక్కడికి వంశీధర్‌రెడ్డి వచ్చారు. వారిద్దరి మధ్య మాటమాట పెరిగి ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. వంశీధర్‌రెడ్డి అబ్బాస్‌ను రాడ్డుతో కొట్టి గాయపరిచాడు. అబ్బాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడు అబ్బాస్ చికిత్స నిమిత్తం 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డయాసీస్ ఆఫ్ కడప సొసైటీ, మరియాపురం, కడప

సవరణ ప్రకటన

పైన పేర్కొన్న యాజమాన్యం గతంలో - 14.03.2024 మరియు 15.03.2024వ తేదీలలో ఈనాడు మరియు ఆంధ్రజ్యోతి దినపత్రికలలో ఇచ్చిన ఉద్యోగ ప్రకటనలో రెండు సబ్జెక్టులకు సంబంధించిన రోస్టర్ పాయింట్లలో టైపింగ్ తప్పిదము వల్ల రెండు తప్పులు దొర్లినవి. వాటిని సవరించి తాజాగా సవరణ ప్రకటన ఇస్తున్నాం.

1) S.A. (Maths) - మొత్తం ఖాళీలు - 03
సదరు ఖాళీల రోస్టర్ పాయింట్లు క్రింది విధంగా ఉన్నాయి.
1. - R.P.No. 2 - SC, 2. -R.P. No. 3 - OC (Christian Minority)
3. - R.P. No. 4 - BC -A

2) Gr.II Telugu Pandit - మొత్తం ఖాళీలు - 05
సదరు ఖాళీల రోస్టర్ పాయింట్లు క్రింది విధంగా ఉన్నాయి.
1. - R.P. No. 1 - OC, 2. - R.P.No. 2 - SC, 3. - R.P.No. 3 - OC,
4. - R.P. No. 4 - BC-A, 5. - R.P. No. 5 - OC

గతంలో ప్రకటించిన మిగిలిన పోస్టుల ఖాళీలకు సంబంధించిన రోస్టర్ పాయింట్లు యదాతథంగా ఉంటాయి.

గమనిక : పైన సవరించిన BC-A Rosterకు సంబంధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తులు పంపించవలెను. ఒకవేళ BC-A అభ్యర్థులు గతంలో పైన పేర్కొన్న పోస్టులకు సంబంధించి దరఖాస్తులు పంపించి ఉన్నట్లయితే వారు మళ్ళీ దరఖాస్తులు పంపకూడదు. తాజాగా దరఖాస్తుల్ని పంపిస్తున్న BC-A అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రము తప్పనిసరిగా జతపరచవలెను.

పైన పేర్కొన్న సబ్జెక్టులకు కొత్తగా దరఖాస్తు చేసుకుంటున్న BC-A అభ్యర్థులు దరఖాస్తులను పంపవలసిన చివరి **తేదీ : 14.06.2024.** సదరు నియామక ప్రక్రియకు సంబంధించి గతంలో ప్రచురించిన అన్ని నిబంధనలు యధాతథం.

దరఖాస్తులు పంపించవలసిన చిరునామా : బిషప్ గాలి బాలి, మేనేజర్, బిషప్స్ హౌస్, మరియాపురం - 516 003, కడప, వై.యస్.ఆర్.జిల్లా. ఆం.ప్ర.
సంప్రదించవలసిన ఫోన్ నెంబరు : బిషప్ సెక్రటరి : 7993803777

అన్నదానానికి రూ.100116 విరాళం

చక్రాయపేట, జూన్ 7: ప్రసిద్ధ గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.100116 విరాళం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. శనివారం గండి కార్యాలయంలో రాజంపేట మండలం పెద్దూరు ఆకేపాడుకు చెందిన టంగుటూరు నరసారెడ్డి కుటుంబ సభ్యులు ఈ విరాళం అందించినట్లు తెలిపారు. వారికి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేషవస్త్రంతో వేద ఆశీర్వచనం అందించినట్లు ముకుందరెడ్డి తెలిపారు.



నరసారెడ్డికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏసీ ముకుందరెడ్డి

డిజిటల్ పేమెంట్‌లో

మొదటి స్థానంలో ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 7 : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్స్ చెల్లింపులో రాష్ట్రంలో ప్రొద్దుటూరు మొదటి స్థానంలో ఉందని ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ తిమ్మరాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక మద్యం దుకాణాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ లిక్కర్ డిపో పరిధిలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, బద్వేల్ నియోజకవర్గాలోని మద్యం దుకాణాల్లో గత నెల రూ.63.42 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయని తెలిపారు. మద్యం దుకాణాల్లో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌పై చర్యలు తీసుకున్నామని తెలిపార. అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని మద్యం సిబ్బందిని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

రాయచోటిటౌన్, జూన్7: ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ శాసన మండలి మాజీ సభ్యుడు కత్తి నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో జరిగిన ఎస్టీయూ మొదటి కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన 117 జీవో ఉపాధ్యాయుల ఉద్యోగాలకు ప్రమాదకరంగా మారిందన్నారు, రేషనలైజేషన్‌లో భాగంగా ఉపాధ్యాయుల పోస్టులను కుదించడం ద్వారా పిల్లలను నాణ్యమైన విద్య అందుబాబులోకి రాలేదన్నారు. కొత్త ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేసి ఇంగ్లిష్ మీడియం కొనసాగించాలన్నారు. సంఘ నాయకులతో చర్చించి వారి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అనంతరం ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల బకాయిలను త్వరలో చెల్లించాలని, హెల్త్‌కార్డులను పూర్తి స్థాయిలో విని వినియోగంలోకి తీసుకురావాలని, సీపీఎస్ రద్దుకు చొరవ చూపాలన్నారు. 12వ వేతన సవరణ సంఘం సిఫారసుల అమలుకు చొరవచూపడంతోపాటు, మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంకరం శివారెడ్డి, పోకల మధుసూదన్, రాష్ట్ర ఉపాధ్యాయనీ సంపాదకులు గాజుల నాగేశ్వరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యంరాజు, ఆదినారాయణరెడ్డి, కడియాల మురళి, మహేశ్వరిరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీయూ అన్నమయ్య జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

అక్రమ బదిలీలపై కొరడా

- ఎన్నికల ముందు అడ్డగోలు బదిలీలు
- ప్రభుత్వం మారడంతో నిలుపుదల
- లబోదిబోమంటున్న 150 మంది టీచర్లు



కడప (ఎడ్యుకేషన్), జూన్ 7: మాదే అధికారం, అంతా మా ఇష్టం, మమ్మల్ని ఎవరురా ఆపేది. మేం చెప్పిందే రూల్, మేం ఏదైనా చేయగలమంటూ వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలకు తెర లేపింది. ముడుపులు ఇస్తే చాలు నిబంధనలు సైతం పట్టించుకోకుండా బదిలీలు చేసింది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో బదిలీల ప్రక్రియ నిలిచింది. ఎన్నికలు పూర్తయిన తరువాత బదిలీలు చేసేందుకు విద్యాశాఖ నడుం బిగించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వైసీపీ చేసిన అవకతవకలకు పరిశీలించాలని, అంతవరకు అవన్నీ నిలుపుదల చేయాలనే సంకేతాలు అధికారులకు రావడంతో అక్రమ బదిలీలకు సైతం బ్రేక్ పడినట్లయింది. దీంతో జిల్లా నుంచి బదిలీల కోసం ముడుపులు చెల్లించిన దాదాపు 150 మంది ఉపాధ్యాయులు లబోదిబోమంటున్నారు.

గత ఏడాది ఆగస్టులో వైసీపీ ప్రభుత్వం అడ్డగోలు బదిలీలకు తెర లేపింది. విద్యాశాఖ మంత్రి కార్యాలయం కేంద్రంగా ఈ వ్యవహారం కొనసాగింది. జిల్లా నుంచి దాదాపు 80 మందికి పైగా ఉపాధ్యాయులు కోరుకున్న స్థానాలకు బదిలీ ఆర్డర్లు తెచ్చుకున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఇచ్చినట్లు సమాచారం. అయితే వారు అనుకున్న నగరాలకు సమీపంలో ఖాళీలు లేకపోవడంతో ఆ ఉత్తర్వులు అలాగే నిలిచిపోయాయి. ఖాళీలు ఏర్పడ్డాక చేరదామని పక్కనబెట్టారు. తాజాగా ఎన్నికలకు ముందు మరో 70 మంది వరకు ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు జారీ చేసి కోడ్ ముగిసిన తరువాత జిల్లాలో దాదాపు 150 మందికి పైగా ఉపాధ్యాయులను రిలీవ్‌కావాలని పాఠశాల విద్యాశాఖ పీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆ బదిలీలను నిలుపుదల చేస్తూ పీఎస్ ప్రవీణ్ ప్రకాశ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంలో పాఠశాల విద్యాశాఖలోని కొందరు అధికారులు, కొన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మరికొందరు ఉద్యోగుల పాత్ర కూడా ఉండడం చర్చనీయాంశమైంది.

లబోదిబోమంటున్న ఉపాధ్యాయులు

ఏదో ముడుపులు చెల్లించి కోరుకున్న పాఠశాలకు బదిలీ చేసుకుందామనుకున్న ఉపాధ్యాయులు బదిలీ ఉత్తర్వులు నిలుపుదల చేయడంతో లబోదిబోమంటున్నారు. సాధారణంగా ఉపాధ్యాయులు ఎంతో ఆలోచన చేసి అది అత్యవసరం అయితేనే ఖర్చు చేస్తారు. వృథా ఖర్చు చేసే ఆలోచన ఎంత మాత్రం చేయరు. అటువంటిది బదిలీల కోసం లక్షల రూపాయలు ముడుపులు చెల్లించారు. వైసీపీ ప్రభుత్వం మళ్లీ వస్తుంది, తాము కోరుకున్న పాఠశాలలకు చేరిపోతామనుకున్నారు. అయితే వారి వ్యూహం బెడిసి కొట్టింది. లక్షల రూపాయలు గంగపాలయ్యాయని ఆవేదన చెందుతున్నారు. తిరిగి అడుగుదామనుకున్నా ప్రభుత్వం కూడా లేదు. ఉపాధ్యాయ సంఘ నాయకులు కూడా ముఖం చాటేస్తున్నారని తెలుస్తోంది. అధికారులను అయితే అడగలేని పరిస్థితి. మళ్లీ వారితో ఏం పని పడుతుందోనన్న భయం. దీంతో ముడుపులు చెల్లించిన ఉపాధ్యాయులు గోడు ఎవరికి చెప్పాలో తెలియక లబోదిబోమంటున్నారు.

టీడీపీలో కొనసాగుతున్న జోష్

కడప(ఎర్రముక్కపల్లె),జూన్7: వాన వెలిసి వజ్రాలు దొరికినట్టుంది.. నోములు పండి వరాలు కురిసినట్టుంది... తపస్సు ఫలించి కోర్కెలు నెరవేరినట్టు... ఇదంతా తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.. ఎన్నికల ఫలితాలు వెలువడి మూడు రోజులు దాటినా వారిలో జోష్ ఏమాత్రం తగ్గనే లేదు.. విజయోత్సాహం ఉప్పొంగుతూనే ఉంది. సంబరాలు అంబరాన్నటుతూనే ఉన్నాయి.. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతున్న శుభ సందర్భంగా రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని అందరూ ఆనందిస్తున్నారు..

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. డ్రమ్స్, వాయిద్యాలతో డ్యాన్సులు వేయించారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. శుక్రవారం ఎన్టీఆర్ సర్కిల్‌లో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి హాజరయ్యారు. ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప చరిత్ర తిరగరాసిన ఘనత కడప ప్రజలదేనన్నారు. తనను తమ ఆడపడుచుగా భావించి అత్యంత మెజార్టీతో గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తాను ఇచ్చిన ఎన్నికల హామీలు అన్నీ నెరవేరుస్తాన న్నారు. ఎన్నికల హామీలో భాగంగా షహమీరియా బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్న ట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, టీడీపీ నాయకులు జిలానీబాషా, మాజీ డిప్యూటీ మేయర్ ఆరిఫుల్లా, పోతుగుంటి పీరయ్యతో పాటు అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు హాజరయ్యారు.

గండి క్షేత్రంలో 1001 టెంకాయలు కొట్టిన కార్యకర్తలు: చక్రాయపేట, జూన్ 7: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతున్న సందర్భంగా మండలంలోని గడ్డంవారిపల్లె నుంచి గండి క్షేత్రం వరకు పాదయాత్ర చేపట్టి 1001 టెంకాయలు కొట్టారు. శనివారం కొనసాని శంకర్‌రెడ్డి, గంగవరపు శివప్రసాద్‌రెడ్డి, గంగవరపు రవికుమార్‌రెడ్డి, మాజీ సర్పంచు గొంది వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టి గండిలో టెంకాయలు కొట్టారు. వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని, పేద బడుగు బలహీన వర్గాలకు అండగాఉంటాడని, సూపర్‌సిక్స్ పథకాలు పెట్టి ప్రజల్లో నిలుస్తారన్నారు.

ఈ కార్యక్రమంలో మద్దికవాండ్లపల్లె ఆనందరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటసుబ్బయ్య, రెడ్డయ్య, వెంకటరామిరెడ్డి, చిన్నపుల్లయ్యగారి మోహన్‌రెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ, అన్నదానం

మండలంలోని సురభి గ్రామం నాగులగుట్టపల్లెలో శుక్రవారం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భారీఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మాజీ జడ్పీటీసీ రాధాకృష్ణయ్య, బీజేపీ రాష్ట్ర కన్వీనర్ కె.రామచంద్రారెడ్డి, చలపతి, నాగమల్లయ్య, దశరథ, కోమటిపేట జనసేన యువనాయకులు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పపిణీ చేశారు. ఉదయం 11గంటల నుంచి అన్నదానం నిర్వహించారు. నాగులగుట్టపల్లె మెయిన్‌రోడ్డుపై విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, సుపరిపాలన అందిస్తాడనే నమ్మకంతో భారీ విజయాన్ని అందించారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణచైతన్యరెడ్డికి మద్దతుగా గండికి పాదయాత్ర

పెండ్లిమర్రి, జూన్ 7: కమలాపురం శాసన సభ్యుడిగా ఎన్నికైన కృష్ణచైతన్యరెడ్డికి మద్దతుగా టీడీపీ శ్రేణులు శుక్రవారం గండి క్షేత్రానికి పాదయాత్ర చేపట్టారు. గండి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కడప నగరంలో ఎన్టీఆర్ వీరాభిమాని ప్రదర్శన





విజయకేతనం చూపుతున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు



పెండ్లిమర్రి: పాదయాత్రగా వెళ్తున్న టీడీపీ నాయకులు







కడప నగరంలోని ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న గోవర్ధన్‌రెడ్డి... నాగులగుట్టపల్లెలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు... గండి క్షేత్రంలో టెంకాయలు కొడుతున్న టీడీపీ కార్యకర్తలు

'దుష్ప్రచారాలకు పాల్పడితే చర్యలు తప్పవు'

వల్లూరు, జూన్ 7: రాజకీయ పార్టీల గురించి ఒకరిపై ఒకరు వ్యక్తిగత విషయాలపై సోషల్ మీడియాలో దుష్ప్రచారాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వల్లూరు సబ్ ఇన్స్‌పెక్టరు కత్తి వెంకటరమణ అన్నారు. శుక్రవారం వల్లూరు పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడారు. గత రెండురోజులుగా ఒకరిపై ఒకరు అసభ్యకరంగా మాట్లాడుతూ వీడియోలు సోషల్ మీడియాలో పోస్టు చేయడం వల్ల ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు వారిపై చట్టపరంగా కేసు నమోదు చేశామన్నారు. వల్లూరు మండలంలో రాజకీయ పార్టీల గురించి వ్యక్తిగత విషయాల గురించి అసభ్యకరంగా మాట్లాడడం వాటిని సోషల్ మీడియాలో వాట్సప్ గ్రూప్‌లలో వీడియోలు పోస్టు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎవరికైనా కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

మాధవీరెడ్డికి అభినందనలు తెలిపిన బ్రాహ్మణ సంఘం

వేంపల్లె, జూన్ 7: కడప ఎమ్మెల్యేగా మాధవిరెడ్డి గెలుపొందడం అభినందనీయమని బ్రాహ్మణసంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం కడపలో ఉన్న ఎమ్మెల్యే మాధవిరెడ్డిని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రావుకలిసి అభినందనలు తెలిపారు. వైసీపీ పాలనలో గత ఐదేళ్లుగా బ్రాహ్మణులకు ఎలాంటి సంక్షేమ పథకాలు మంజూరు చేయకపోవడంతో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసినట్లు చెప్పారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరణ చేసి వాటి ద్వారా సంక్షేమపథకాలు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

నేటి నుంచి రేణుక యల్లమ్మ తిరుణాల

గాలివీడు, జూన్7: నూలివీడు పంచాయతీ నాగూరువాండ్లపల్లె సమీపంలో శనివారం నుంచి రేణుక యల్లమ్మ తిరుణాల జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏటా మొలకల పౌర్ణమి తర్వాత వచ్చే అమావాస్య రోజు పుట్టపూజతో అమ్మవారి ఊరేగింపు ప్రారంభ మవుతుంది. శనివారం చాందినీ బండ్లు ఏర్పాటు చేయనున్నారు.

వీరపునాయునిపల్లెలో వర్షం

వీరపునాయునిపల్లె, జూన్ 7: మండలంలో 12గంటల ప్రాంతంలో నుంచి విడిచి విడిచి వర్షం కురవడంతో ఉక్కపోత నుంచి కొంతమేర ఎండవేడిమి నుంచి ఉపశమనం పందారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే పదును వర్షాలు కురుస్తుండడంతో వేసవి దుక్కులు కూడా బాగా వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. పదును వర్షం కురవడంత భూగర్భజలం పెరుగుతుందని రైతులు శాభావం వ్యక్తపరుస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిస్తే ఖరీఫ్ పంటలు సాగుచేసుకునేందుకు అవకాశం ఉంటుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నపాటి వర్షం కురిస్తే వీధుల్లోకి చేరిన నీరు

శుక్రవారం కురిసిన వర్షానికి పలు వీధులలో వర్షపు నీరు నిలిచి కుంటలాగా దర్శనమిస్తున్నాయి. పాలక ప్రభుత్వాలు మారుతున్నకూడా వీదులలో మురుగునీటి కాల్వలు లేకపోవడంతో సిమెంటురోడ్లు సక్రమంగా లేకపోవడంతో వర్షపునీరంతా దిగువవీధులలో నిల్వ ఉండడంతో రాత్రివేళలో దోమల బెడద తాకిడికి తట్టుకోలేక పోతున్నామని పలువురు గ్రామస్థులు వాపోతున్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలని కోరుతున్నారు.

తొండూరు ఐటీఐలో అడ్మిషన్లు ప్రారంభం

పులివెందుల టౌన్, జూన్ 7: మండల కేంద్రమైన తొండూరులోని ఐటీఐలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐ నందు డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ మరియు మెకానిక్ డీజల్ ట్రేడ్‌లలో అడ్మిషన్లు చేసుకోవచ్చు అన్నారు. పదవ తరగతి పాసైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకోవచుచ అన్నారు. ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని, తొండూరు ప్రభుత్వ ఐటిఐని సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్, జూన్ 7: పట్టణంలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లపురెడ్డిపల్లె, ఇ.కొత్తపల్లె, కదిరిరోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మత్తుల కారణంగా ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

పాదయాత్రకు సంఘీభావం తెలిపిన గోవర్ధనరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 7 : టీడీపీ అధికారంలోకి రావాలని కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి గెలవాలని మొక్కుబడి చెల్లింపులో భాగంగా టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు బొజ్జ తిరుమలేశ్ చేపట్టిన పాదయాత్రకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి సంఘీభావం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం కోడూరు బాలాయపల్లె చెక్‌పోస్టు చేరుకుని టీఎన్‌ఎస్‌ఎఫ్ తిరుమలేశ్‌కు కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలకు సంఘీభావం తెలుపుతున్నగోవర్ధనరెడ్డి

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

కడప (ఎడ్యుకేషన్), జూన్ 7 : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని అలాగే పెండింగులో ఉన్న కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని పీడీఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే మాధవీరెడ్డిని కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భగా జిల్లా కార్యదర్శి శ్రీనాధ్‌యాదవ్ మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా విద్యార్థులకు ఇస్తున్నటువంటి కాస్మటిక్ మెస్‌ఛార్జీలను పెంచాలని తొమ్మిది నెలల నుండి పెండింగులో ఉన్నఛార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు స్వరూప్‌తేజ, విఘ్నేశ్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 7: కడప ఎమ్మెల్యేగా ఎంపికైన రెడ్డప్పగారి మాధవీరెడ్డిని కడప ద్వారకానగర్‌లోని ఆమె నివాసంలో 25వ డివిజన్ టీడీపీ నాయకులు బండి బాబు, సత్య, బండి కుమార్, సాయిచరణ్, బండి నరేశ్, మురికినాటి రాజశేఖర్, మన్యం చలపతిరావు, నాగరాజ, రమణకుమార్, జనసేన నాయకులు సాయిరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాధవీరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 25వ డివిజన్ టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మాధవీరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నేతలు

పాఠశాలల్లో స్వీపర్లకు పెండింగు వేతనాలు చెల్లించాలి

కడప (ఎడ్యుకేషన్), జూన్ 7 :ప్రభుత్వ పాఠశాలల్లో గత విద్యాసంవత్సరం రాగిజావ, గుడ్లు సబ్బులు స్వీపర్లకు పెండింగులో ఉన్న నాలుగు నెలల వేతనాలు తక్షనం విడుదల చేయాలని ఏఐటీయుసి జిల్లాడిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. శుక్రవారం కడప ఎంఈవో కార్యాలయంలో కడప ఎంఈవో నారాయణకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత విద్యాసంవత్సరం విద్యార్థులకు ఆటంకం లేకుండా రాగిజావ, గుడ్లు, ఉడకబెట్టిన గుడ్లు ఇవ్వడం జరిగిందని, కార్మికులకు పది నెలలుగా డబ్బులు ఇవ్వకుండా అధికారులు తిప్పుకోవడం సరైంది కాదన్నారు. పెండింగులో ఉన్న నాలుగు నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని కోరారు. ఏఐటీయుసి నాయకులు సి.సుబ్బరాయుడు, శాంతమ్మ, నాగలక్ష్మి, వేమక్క, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకుడు బాదుల్లా

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా సాయి శ్రీనివాస్

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 7:ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథ రెడ్డి తెలిపారు. శుక్రవారం కడప నగరం ఎస్టీయు భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులను ఐదు సంవత్సరాల పాటు వేధించినందుకు ఈ ఎన్నికల్లో గత ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుందని అన్నారు. ప్రస్తుతం ఉద్యోగ ఉపాధ్యాయుల అభిమతానికి అనుగుణంగానే కొత్త ప్రభుత్వం ఏర్పడిందని, ఈ ప్రభుత్వమైనా ఈ రాష్ట్రంలోని ఉద్యోగుల మనోభావాలనుగుణంగా పనిచేయాలన్నారు. సాదారణ ఎన్నికల్లో అనారోగ్య కారణాల వల్ల గైర్హాజరైన ఉద్యోగులకు వివిధ జిల్లా కలెక్టర్లు ఇచ్చిన చార్జ్ మెమోలు వెనక్కి తీసుకోవాలని కోరారు. 12వ పీఆర్సీ అమలులో భాగంగా తక్షణమే మధ్యంతర భృతి ప్రకటించాలని పాఠశాల విద్యలో 117 జీవో రద్దు చేయాలని ఇంగ్లీషు మీడియంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించాలని కోరారు. రాష్ట్ర నాయకులు కె.సురేష్‌బాబు, రమణారెడ్డి, కె.బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంఘమేశ్వర్‌రెడ్డి, నాయకులు సుబ్రమణ్యం, రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

కూటమి విజయం చారిత్రాత్మకం

కడప(కలెక్టరేట్), జూన్ 8: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి విజయం చారిత్రాత్మకం అని ఏపీ ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర సహాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం ఏపీ ఎన్జీఓ సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ నూతన ప్రభుత్వానికి ఉద్యోగులందరూ పూర్తి సహాయ సహకారాలు అందించి మంచి పేరు తెస్తామన్నారు. ఉద్యోగులకు, పింఛనర్లకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు, పింఛన్లు ఇవ్వాలన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని, డీఏ అరియర్స్, సరెండర్ లీవ్స్, 12వ పీఆర్సీ అమలు వంటి ప్రధాన డిమాండ్స్ నూతన ప్రభుత్వం అందింస్తోందనే ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా నాయకులు తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, శ్రీనివాసులు, బ్రహ్మానందరెడ్డి, రాజశేఖర్, బాలపుల్లయ్య, పోలిరెడ్డి, సైలే శ్వర్‌రెడ్డి, పద్మనాభం, నాలుగో తరగతి సంఘం అధ్యక్షుడు కాటమయ్య పాల్గొన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న ఏపీ ఎన్జీఓ సంఘ నాయకులు శ్రీనివాసులు

నారాయణను కలిసిన ఎర్రంశెట్టి మస్తాన్ రాయల్

కడప (ఎడ్యుకేషన్), జూన్ 7 :పెంచలకోన బలిజ, కాపు అన్నదాన సత్రం గౌరవ అధ్యక్షుడు ఎర్రంశెట్టి మస్తాన్ రాయల్ శుక్రవారం నెల్లూరు ఎమ్మెల్యే నారాయణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నదాన సత్రం చైర్మన్ కోనేటి మురళీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



నారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న పెంచలకోన బలిజ, కాపు అన్నదాన సత్రం గౌరవ అధ్యక్షుడు మస్తాన్ రాయల్

నారా లోకేశ్‌ను కలిసిన పుత్తా లక్ష్మీరెడ్డి

కమలాపురం రూరల్, జూన్ 7:కమలాపురం టీడీపీ యువ నాయకులు పుత్తా లక్ష్మీరెడ్డి ఉండవల్లిలోని నారాలోకేశ్ నివాసంలో టీడీపీ జాతీయ కార్యదర్శి నారాలోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో పుత్తా చైతన్యరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి టీడీపీ జెండా ఎగరవేసినందుకు కృషి చేసిన అందరినీ ఆయన అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మిరెడ్డి, పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డిపై నమ్మకం ఉంచి టికెట్ ఇచ్చినందుకు ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించుకున్నామని ఇప్పుడు మాపై నమ్మకంతో ఓట్లు వేసిన నియోజకవర్గంలోని ప్రజలకు నియోజకవర్గ అభివృద్ధికి మీ సహాయ సహకారాలు అందించాలని కోరినట్లు సమాచారం. అనంతరం విజయవాడ కనక దుర్గమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారి ఆలయంలోనే పుత్తా లక్ష్మీరెడ్డి వేద పండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు.



నూతన ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలి

- ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 7: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడే ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి పరిరక్షణకు కృషి చేయాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయం లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ ప్రకటిస్తూ మొదటి సంతకం చేయాలన్నారు. ఖాళీగా ఉన్న 28వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జీఓ 117 రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో 12 వేల పాఠశాలలు సింగల్ టీచర్స్ స్కూళ్లుగా మారిపోయినందున విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్టీఎఫ్ నాయకులు తుపాకుల మురళి, ఆవుల శ్రీనివాసులు, ఎ.రామచంద్ర, చంద్రశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామాంజనేయులు

'మంత్రివర్గంలో బలిజలకు సముచిత స్థానం కల్పించండి'

కడప (మారుతీనగర్), జూన్ 7: రాష్ట్రంలో కొలువుదీరనున్న తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మంత్రివర్గంలో బలిజ వర్గానికి చెందిన శాసనసభ్యులకు సముచిత స్థానం కల్పించాలని బలిజసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్ రాయల్ కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘన విజయంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పెద్దన్న పాత్ర పోషించారనే సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. తిరుపతి, రైల్వేకోడూరు, నియోజకవర్గాలలో వైసీపీకి చెందిన అరాచక శక్తులను ఓడించడం ఆనందదాయకమ న్నారు. తిరుపతి నియోజకవర్గ పరిధిలో అత్యంత విలువైన ప్రభుత్వ ఆ స్తులు వైసీపీ పాలనలో దోపిడికి గురయ్యాయని, అలాగే టీటీడీలో జరిగిన అవకతవకలను సరిదిద్దేందుకు వీలుగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. బలిజసేన రాష్ట్ర మహిళా కార్యదర్శి రెడ్డి రాణి, కార్యదర్శి అనంతరాయలు, జిల్లా అధ్యక్షుడు నరసింహ, అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మస్తాన్ రాయల్

పుత్తా చైతన్యరెడ్డి గెలుపుతో తిరుమలకు పాదయాత్ర

చెన్నూరు, జూన్ 7: కమలాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి గెలవడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలుగుయువత నేత గుగ్గిళ్ల చాణక్య ఆధ్వర్యంలో జయప్రకాశ్ (చంటి), రెడ్డిసిద్దార్థ, సాయికుమార్‌రాజు తది తరులు శుక్రవారం చెన్నూరు నుంచి తిరుమలకు పాదయాత్రగా బ యల్దేరారు. ఈ సందర్భంగా చాణక్య మాట్లాడుతూ క్రిష్ణచైత్యన్యరెడ్డి విజయం సా ధించడం నియోజకవర్గానికి శుభపరిణామన్నారు. ఆయన సారథ్యంలో కమలాపురం నియోజకవర్గంలోని అన్ని మండలాలు సమగ్రాభివృద్ధి చెందుతాయన్నారు.



అక్రమ అడ్మిషన్లపై చర్యలేవీ: ఏఐఎస్ఎఫ్

కడప (ఎడ్యుకేషన్), జూన్ 7: జిల్లాలో ప్రభుత్వ నిబంధనలను అటకెక్కించి అక్రమ అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలపై చర్యలేవని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్ర.దాన కార్యదర్శి గుజ్జుల వలరాజు తెలిపారు. శుక్రవారం కడప నగరం చైతన్య విద్యాసంస్థల ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో నెం.1, 42 ప్రతి పాఠశాలలో అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. విద్య పేరుతో కోట్ల వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. తల్లిదండ్రులను మోసం చేస్తూ డబ్బు దోచుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి తక్షణం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఆది, భూపేశ్‌రెడ్డి



జమ్మలమడుగు, జూన్ 7: జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి తదితరులు గురువారం రాత్రి చంద్రబాబును కలిశారు. శుక్రవారం జమ్మలమడుగు మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి, దేవగుడి డాక్టర్ రాజేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు చంద్రబాబును కలిశామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ప్రాంతానికి చెందిన మరికొంతమంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

పుట్టాకు శ్రీవారి ప్రసాదం అందవేత



మైదుకూరు, జూన్ 7 : శాసనసభ్యుడిగా ఎన్నికైన పుట్టా సుధాకర్ యాదవ్‌కు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని స్థానిక టీడీపీ నాయకులు అందించారు. పుట్టా విజయంపై స్థానిక 14వ వార్డు ఇన్‌చార్జి పండిటి పెద్దయ్య, నాయకులు మాదం రమణ, సురేష్, మారుబోయిన రమణ తదితరులు శ్రీవారిని దర్శించుకొని వచ్చి హైదరాబాదులో ఉన్న సుధాకర్ యాదవ్ నివాసం చేరుకొని ప్రసాదాన్ని అందించారు.

చిలమకూరులో రెండురోజులుగా వదలని నీరు

ఎర్రగుంట్ల, జూన్ 7: మండల పరిధిలోని చిలమకూరులో రెండురోజులుగా నీరు సక్రమంగా వదలడంలేదని ప్రజలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ముద్దనూరు రోడ్డులోని సంప్ వద్ద ప్రజలు ఆందోళన చేపట్టారు. అధికారం మారిన వెంటనే ఇలాంటి చర్యలకు పాల్పడతారా అంటూ కొందరు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నీరు వదిలే పంప్ ఆపరేటర్ రామక్రిష్ణ ఆయన వదలకుండా మరొకరితో వదిలిస్తున్నాడని ఆరోపించారు. రామక్రిష్ణ సెలవులో ఉన్నట్లుగా చెబుతున్నారని అయితే నీరు ఎవరు వదలాలని వారు అధికారులపై మండి పడ్డారు. స్థానిక సర్పంచ్ తీవ్ర నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నాడని విమర్శించాడు. ఎంపిటీసీ నవీన్,టీడీపీ, బీజేపీ నాయకులు నాగేశ్వరరెడ్డి, బాలవెంకటరరెడ్డి అధికారులతో మాట్లాడి మరొకరికి నీరు వదిలే పనిని అప్పజెప్పి నీరు వదిలించారు. త్వరలో ఒకరిని శాశ్వతంగా నియమించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

● ఈవిషయాన్ని ఇన్‌చార్జి కార్యదర్శి క్రిష్ణయ్యను వివరణ కోరగా తాను నిన్ననే ఇన్‌చార్జి తీసుకున్నట్లు తెలిపారు. అయితే వ్యక్తిగత పనిపై విజయవాడకు వెళ్లినట్లు పేర్కొన్నారు. విషయాన్ని తెలుసుకుని నీటి సమస్యలేకుండా చేస్తానని తెలిపారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 7: ప్రజల ఆకాంక్షల మేరకు ఎన్నికల్లో విజయం సాధించిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిఎండీ నజీర్ పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యేగా ఎన్నికైన పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలు జగన్ అరాచక పాలన పోవాలని వరదరాజులరెడ్డిని ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని, ఆయన నియోజకవర్గాన్ని అబివృద్ధి చేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు జిలానీబాష, సుధీర్ పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 7: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని ఎంఈవో సావిత్రమ్మ పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తినారాయణాచార్యుల గ్రేడ్-1 గ్రంథాలయంలో సమ్మర్‌క్యాంపు ముగింపు సమావేశంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమొంటోలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ తిరుపతమ్మ, రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీంసాహెబ్, అధ్యాపకులు చాడా మునిశేఖర్‌రెడ్డి, పవన్‌కల్యాణ్, ప్రభాకర్ రెడ్డి, వెంకటకొండయ్య, నిర్మళాజ్యోతి, గంగాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి



గాయపడిన షేక్ సోహైల్

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 7 : ప్రొద్దుటూరులో టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకులు శుక్రవారం రాత్రి మచ్చుకత్తితో దాడి చేశారు. దీంతో అతనికి తీవ్రగాయాలు కాగా ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రూరల్ పోలీసుల వివరాల మేరకు ప్రొద్దుటూరు పట్టణంలోని ఇస్లాంపురానికి చెందిన షేక్ సోహైల్ అనే యువకుడు ముక్తియార్ వెంట తిరుగుతూ ఉన్నాడు. దీంతో 19 వార్డు వైసీపీ ఇన్‌చార్జి చాంద్‌బాష, అతని అనుచరులు టీడీపీలో తిరిగితే చంపేస్తామని సోహైల్‌ను బెదిరించేవారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం సోహైల్ తన స్నేహితులతో కలిసి సినీహబ్ సమీపంలోని ఓ దుకాణంలో టీ తాగడానికి వెళ్లారు. అంతలోనే అక్కడి వెళ్లిన చాంద్‌బాష, అతని అనుచరుడు అవతార్ మరికొందరు కలిసి సోహైల్‌పై దాడి చేశారు. అడ్డుకోబోయిన బాధితుడి స్నేహితులను చంపేస్తామని బెదిరించారు. అ తర్వాత వెంట తెచ్చుకున్న మచ్చుకత్తితో దాడి చేశారు. దీంతో సోహైల్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. గట్టిగా కేకలు వేయడంతో దాడి చేసిన వైసీపీ నాయకులు పరారయ్యారు. కాగా సోహైల్‌ను అతని స్నేహితులు వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అస్పత్రికి చేరుకుని బాధితునితో మాట్లాడారు. అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అరకొరగా పాఠ్యపుస్తకాలు సరఫరా

● ఇంకా సరఫరా కాని డిక్షనరీ, యూనిఫాం, బ్యాగులు



మండలానికి సరఫరా అయిన పాఠ్యపుస్తకాలు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 7: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభం అయ్యేరోజునే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తామన్న గత వైసీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో పుస్తకాలను పంపిణీ చేయలేకపోయింది. మరో ఆరు రోజులలో పాఠశాలలు ప్రారంభం కానుండగా ఇప్పటికీ అరకొరగానే పుస్తకాలు పంపిణీ అయ్యాయి. మండలంలో 110 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఆ పాఠశాలలో చదివే విద్యార్థులకోసం అరకొరగా పుస్తకాలు సరఫరా చేశారు. మొదటి సెమిస్టర్ సంబంధించి మొదటి విడతలో 48,993, రెండో విడతలో 22,012 పుస్తకాలు సరఫరా చేశారు. వచ్చిన పుస్తకాలలో 1, 2 తరగతులకు 6 పుస్తకాలు, 3వ తరగతిలో 4 పుస్తకాలు సరఫరా చేయగా 4వ తరగతివారికి ఒక్క పుస్తకం సరఫరా చేయలేదు. 5వ తరగతికి సంబంధించి తెలుగు పాఠ్యపుస్తకమే రాగా 6, 7 తరగతులకు తెలుగు, గణితం పాఠ్యపుస్తకాలు సరఫరా చేశారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సంబంధించి పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. 80,854 ఉచిత నోట్‌బుక్కులు, బెల్టులు సరఫరా చేయగా మూడు జతల యూనిఫాం, డిక్షనరీ, స్కూల్‌బ్యాగు సరఫరా చేయలేదు. మండలానికి సంబంధించి విద్యాశాఖాధికారులు 1.50 లక్షల పాఠ్యపుస్తకాలకు ప్రతిపాదనలు పంపగా ఇప్పటి వరకు 50 శాతం మాత్రమే పుస్తకాలు పంపిణీ అయ్యాయి. మిగిలిన పుస్తకాలు, మిగిలిన విద్యాసామగ్రి త్వరలో వస్తాయని ఎంఈవో శోభారాణి తెలిపారు.

కొనసాగుతున్న కూటమి నేతల సంబరాలు



జమ్మలమడుగులో కేక్ కట్ చేస్తున్న జనసేన సైనికులు, టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకులు



జమ్మలమడుగు, జూన్ 7: జమ్మలమడుగు జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున ఆధ్వర్యంలో జనసైనికులు కార్యకర్తలు, నాయకులు శుక్రవారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు నియోజకవర్గ జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నార్జున మాట్లాడుతూ కూటమి గెలుపుతో బాధ్యత పెరిగిందన్నారు. రాష్ట్రంలో కూటమితోపాటు జమ్మలమడుగులో బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో జనసేన వందశాతం సీట్లు గెలిచినందుకు జమ్మలమడుగులో బీజేపీ గెలిచినందుకు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన కమిటీ సభ్యులు పవన్‌కుమార్, సీనియర్ నాయకుడు వనం కుమార్, ఉదయ్, హరనాథరెడ్డి, వినయ్, పుల్లయ్య, మహబూబ్, కాటమరాయుడు, జి.పుష్పలత, సుధాకర్, గూడెం చెరువు సుబ్బయ్య, జావీద్ పాల్గొన్నారు.

చాపాడు..: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో శుక్రవారం నెర్రవాడ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వీరభద్రస్వామికి 101 టెంకాయలు కొట్టి మొక్కుబడి తీర్చుకున్నారు. మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్‌యాదవ్ గెలువాలని వారు ఆదేవునికి మొక్కుకున్నారు. వారి కోరిక నెరవేరడంతో టెంకాయలు కొట్టారు. చల్లా శివరాం, సుదర్శన్, సుధాకర్, లక్ష్మీనారాయణ, ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు మొక్కుబడి తీర్చుకున్నారు. ఖాదర్‌పల్లె గ్రామంలో టీడీపీ నాయకుడు నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు కేక్ కట్ చేసి సంతోషంగా జరుపుకున్నారు. కేక్ గ్రామస్థులకు పంచిపెట్టారు.

ప్రొద్దుటూరు..: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందితే సుబ్బిరెడ్డి కొట్టాల చౌడేశ్వరి అమ్మవారికి 108 టెంకాయలు కొడతానని టీడీపీ కార్యకర్త అమర్‌నాథ్ సింగ్ మొక్కుకున్నాడు. ఆమేరకు ఆలయంలో 108 టెంకాయలు కొట్టి మొక్కుతీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పల్లా శంకర్, సుబ్బారెడ్డి, చందా భాస్కర్, మనోహర్, భూషణం, సుబ్బయ్య, వంకంసుబ్బరాయుడు, బాలయ్య, నారాయణ, చక్రవర్తి, మధు,విష్ణు, సూరి, సుబ్బారావు. గణేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువ సౌకర్యం కల్పించండి

● పట్టించుకోని అధికారులు ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆ ప్రాంతవాసులు



రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

జమ్మలమడుగు, జూన్ 7: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని యాడ్లీబాబు వీధి రోడ్డు దారుణంగా మారింది. ప్రతియేడాది వర్షాలు కురిస్తే అసౌకర్యంగా మారింది. స్థానికంగా ఉన్నవారు ఇళ్లలో నుంచి నీళ్లు వదులుతున్నారు. అలాగే వర్షపునీరు ఆగి అసౌకర్యంగా మారినట్లు వాపోతున్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ వార్డులో డ్రైనేజీ లేవని, గతంలో స్థానిక ప్రజలు డ్రైనేజీ కాలువలు నిర్మించాలని కోరారు. అప్పటి ఎన్నికల్లో ఆ ప్రాంతంలో 12వ వార్డుకు సంబంధించి కాలువలు సమస్యలు, పారిశుధ్య సమస్యలు కానీ ఏమున్నా శుభ్రంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పినట్లుగా స్థానికులు తెలిపారు. అయితే మూడు సంవత్సరాల నుంచి డ్రైనేజీ కాలువ నిర్మించలేకపోయారని, ప్రస్తుతం రోడ్డుపై వర్షపునీరు ఎక్కువభాగం నిలుస్తున్నా పట్టించుకునే నాథుడు లేడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్‌కానీ, ఛైర్‌పర్సన్ శివమ్మ వారి సిబ్బంది ఆ రోడ్డును పరిశీలించి డ్రైనేజీ కాలువ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యకు సంబంధించి కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా అక్కడ రోడ్డును పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ప్రొద్దుటూరు , జూన్ 7 : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ రూరల్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటలనుంచి మధాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ డీఈఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. వినియోగదారులు ఈ అంతరాయన్ని గమనించి సహకరించాలన్నారు.

మైలవరం..: మైలవరం మండలంలో శని వారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ కోత ఉండనున్నట్లు మైలవరం విద్యుత్ శాఖ ఏఈ చిదంబర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. తలమంచిపట్నం, దొడియం, తొర్రివేముల, మైలవరం సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ కోత విధించినట్లు తెలిపారు.

టైల్స్ లారీ బోల్తా..ఇరువురికి గాయాలు



కొండాపురం, జూన్ 7: మండలంలోని ముచ్చుమర్రి గ్రామం సమీపంలో టైల్స్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. గుజరాత్ నుంచి టైల్స్ లోడుతో లారీ చెన్నై వెళుతుండగా ముచ్చుమర్రి సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ రహదారిపై రోడ్డు పనులు జరుగుతుండటంతో పాటు, వర్షానికి రోడ్డు సరిగా కనపడకపోవడంతో అదుపుతప్పి బోల్తా పడినట్లు తెలుస్తోంది.ఈ సంఘటనలో డ్రైవర్‌తో పాటు క్లీనర్‌కు గాయాలయ్యాయి.అదేవిధంగా లారీ క్రిందపడటంతో కొన్ని టైల్స్ కూడా పగిలిపోయాయి.

వేపచెట్టు నరికివేత



మైదుకూరు, జూన్ 7 : పట్టణ శివారులోని శ్రీనగర్ పాఠశాల ఆవరణలో ఉన్న వేప చెట్టును నరికివేసి మొద్దులను తరలించారు. పాఠశాల ఆవరణలో ఉన్న వేప చెట్టును పుల్లారెడ్డిగారి వేణుగోపాల్‌రెడ్డి నరికారు. ఆ మొద్దులను ట్రాక్టర్‌లో తరలిస్తున్నారని పాఠశాల ఉపాధ్యాయులు విజయలక్ష్మీదేవి, శోభారాణి, పాఠశాల కమిటీ ఛైర్మెన్ రమీజా ఈ మేరకు పోలీసులతో పాటు ఎంఈవో పద్మలతకు ఫిర్యాదు చేశారు.

బైండోవర్ కేసులు నమోదు

అట్లూరు, జూన్ 7 : అట్లూరు మండలం అభియాబాద్ గ్రామానికి చెందిన మొహిద్దీన్,షాకూర్‌బాషా ఇద్దరిపై పై శుక్రవారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ కేసీ రాజు తెలిపారు. వీరు అభియాబాద్ మెయిన్‌రోడ్డు పక్కనే ఉన్న పొలంలో కంచె వేసేందుకు ఘర్షణకు దిగడంతో ముందస్తు చర్యగా బైండోవర్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



మైదుకూరులో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మైదుకూరు, జూన్ 7 : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి పేర్కొన్నారు. లింగ వివక్షపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మున్సిపల్ పరిధి,మండలంలోని వనిపెంట, జీవీ సత్రం తదితర అంగన్ వాడీ కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు ప్రశాంతి, వరలక్ష్మి, ఓబులమ్మ,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నారాలోకేశ్‌ను కలిసిన శివశంకర్



పోరుమామిళ్ల, జూన్ 7 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్‌ను రాష్ట్ర దివ్యాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి శివశంకర్ మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. శుక్రవారం మంగళగిరిలో ఆయనను కలిశారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

అట్లూరు, జూన్ 7 : అట్లూరు గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విడిది శిబిరం ముగింపులో భాగంగా శుక్రవారం బహుమతులు అందజేసినట్లు గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ తెలిపారు. పుస్తకపఠనం, వ్యాసరచన, చిత్రలేఖనం, ఆటల పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంపీడీవో అమానుల్లా, ఎంఈవో ఖాదర్‌బాషా, ఏవో భాస్కర్ బహుమతులు అందించారు. పాల్గొన్న విద్యార్థులందరికీ కన్సొలేషన్ బహుమతులు కూడా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు, రమణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లల తొలి గురువు అంగన్వాడీ టీచర్



ఖాజీపేట, జూన్ 7: పిల్లల మొదటిగురువు అంగన్వాడీ టీచర్ అని అంగన్వాడీ వర్కర్ గంగావతి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దుంపలగట్టు అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ పిలుస్తోంది రా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మూడు సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

పలు చోట్ల భారీ వర్షం



చెరువును తలపిస్తున్న గాంధీరోడ్డు

జమ్మలమడుగు, జూన్ 7: జమ్మలమడుగులో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఇటీవల అధిక ఉష్ణోగ్రతల వలన ఎండ తీవ్రత, వేడి అధికంగా ఉండేది. ఉన్నట్లుండి రెండు రోజుల నుంచి అప్పుడప్పుడు వర్షాలు కురిశాయి. అందులో భాగంగా సాయంత్రం సుమారు 45 నిమిషాలు వర్షం కురిసింది. దీంతో జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామం తాడిపత్రి ప్రధాన రోడ్డుపై అంజనేయస్వామి గుడి వద్ద వర్షపునీరు నిలిచింది. డ్రైనేజీ కాలువలు నిండి పొంగి ప్రవహించాయి. పట్టణంలోని సైలాస్ పబ్లిక్ స్కూలు ఎదురుగా ప్రధాన రోడ్డు పక్కన వీధిలో రోడ్డు పొడవునా వర్షపునీరు నిలిచింది. అలాగే నాగులకట్ట, ఎంపీడీవో కార్యాలయం, నారాపురం వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వర్షపునీరు నిలిచింది. అలాగే ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో మార్చురీ వద్ద, ఆస్పత్రి ఎదురుగా భారీస్థాయిలో వర్షపునీరు నిలిచింది. అలాగే ఆర్డీవో కార్యాలయం, ఆర్టీసీ బస్టాండు, గ్యారేజీ ఆవరణంలో వర్షపునీరు నిలిచింది. వాతావరణం చల్లబడింది.

పోరుమామిళ్లలో గుంతలమయమైన రోడ్లు

పోరుమామిళ్ల, జూన్ 7 : ఇటీవల కురుస్తున్న వర్షాలకు పోరుమామిళ్లలోని ప్రధాన రోడ్లలో గుంతలు ఏర్పడ్డాయి. కాగా శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పోరుమామిళ్లలోని సాయిబాబా దేవాలయం వద్ద, ఆర్టీసీ బస్టాండు, కొత్తవీధి, అంబేడ్కర్ సర్కిల్, స్టేట్‌బ్యాంకు ప్రాంతాల్లో వర్షపునీరుతో అన్ని గుంతలుగా మారిపోయాయి.డ్రైనేజీ కాలువలు సక్రమంగా లేకపోవడంతో నీరంతా నిల్వఉండి ప్రజలకు ఇబ్బంది కరంగా మారాయి.

ప్రొద్దుటూరు..: ప్రొద్దుటూరులో భారీ వర్షం కురిసింది, శుక్రవారం మధ్యాహ్నం 1 గంటనుంచి 2 రెండుగంటల వరకు ఏకబిగిన వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీతటాలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా గాంధీరోడ్డు సుందరాచార్యుల వీధి వద్దనుంచి మొదలుకొని మోర్ సూపర్ మార్కెట్ వరకు అక్కడినుంచి హోమస్ పేట వరకు రోడ్డంతా జలమయమైంది.కొర్రపాడు రోడ్డు రాజీవ్ సర్కిల్ పాతబస్టాండ్ ఏరియాలో రోడ్లన్నీ జలమయమాయ్యాయి. ప్రధాన రహదారులే కాకుండా కోనేటి కాల్వ వీధి శ్రీరాంనగర్ శ్రీరాముల పేట ఐసుబ్బారెడ్డి వీధి, ఎరికలయ్య ఆశ్రమం వీధి సూపర్ బజార్‌వీధులలో రోడ్డు పై వర్షం నీళ్ళు ప్రవహించాయి.



జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ ఆవరణం, ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద భారీగా నిలిచిన వర్షపునీరు, పోరుమామిళ్ల సాయిబాబా దేవాలయం వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు